# అన్నం పెట్టడం లేదని కలెక్టర్‌కు తండ్రి ఫిర్యాదు


ప్రజావాణిలో ఫిర్యాదు చేసి బయటికి వస్తున్న వృద్ధుడు

**వికారాబాద్, సెప్టెంబర్1, ప్రభాతవార్త :** ఆస్తి తీసుకున్నారు..అన్నం మాత్రం పెట్టడం లేదని ఓ వృద్ధుడు జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్ళితే..వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం చిట్టిగిద్ద గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు తనకున్న ఆస్థిని కుమారులకు పంచి ఇచ్చాడు. వృద్దాప్యం రావడంతో తనకు ఎవరూ అన్నం పెట్టడం లేదంటూ కలెక్టర్‌కు తన గోడును విన్నవించుకున్నాడు. ఈ విషయమై బాధ్యులైన కుమారులపై తగు చర్యలు తీసుకోవాలని క్రింది స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వృద్దుడి ఫిర్యాదుపై అక్కడికి వచ్చి న జనం నెవ్వెరపోయారు. అన్నం పెట్టలేని కొడుకులు ఎంత మంది ఉన్న వ్యర్థం అంటూ వృద్ధుడిపై జాలి చూపించారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత : కలెక్టర్ నారాయణరెడ్డి


ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి అర్బన్,సెపెంబర్01,ప్రభాతవార్త:-**
ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (92) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.రెవెన్యూ శాఖ- 53, ఇతర శాఖలకు - 39, మొత్తం 92 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ హాస్టల్స్, పాఠశాల విద్యార్థులకు అందించే ఆహారాన్ని తయారు చేసే చోటు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన మోలిక వసతులు కల్పించాలన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు పని చేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా తయారు చేయాలని, డూప్లికేట్ ఓటర్లను తీసివేయాలని సూచించారు. ఈ నెల 6వ తేదీన నిర్వహించే గణేష్ నిమజ్జనంలో కావలసిన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండ చూడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా సరిచూసుకోండి

### ఎంపిడివో రవిచంద్ర కుమార్ రెడ్డి

**కేశంపేట సెప్టెంబర్ 1 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని ఓటర్ లిస్టులో తప్పులు లేకుండా చూడాలని గ్రామపంచాయతీలలో మరణించిన వారి ఓట్లు, ఒక్కరికన్న ఎక్కువసార్లు నమోదైన ఓట్లు, పెర్మనెంట్గా మైగ్రేషన్ అయ్యి ఊర్లో లేని వారి ఓటర్ల వివరములను ఆయా గ్రామ పంచాయతీల లోని పంచాయతీ కార్యదర్శి ద్వారా రేపటి వరకు నేడు మంగళవారం సాయంత్రం లోపు కేశంపేట ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీల పెద్దలను రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులకు తెలియజేసినట్లు ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన వివరములను తాసిల్దార్ కార్యాలయానికి పంపించి గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో మరణించిన కూడా ఓటర్ లిస్టులో ఉన్న పేర్లు ఒక్క ఓటరు పేరు పై రెండుసార్లు నమోదైన పేర్ల పై తగు విచారణ జరిపించి తదుపరి చర్యలు చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయని, ఎంపీడీవో తెలిపారు.

# నష్టాల బాటలో మర్పల్లి రైతులు

**పుడమితల్లిని నమ్ముకుని**
**వానకు తడుస్తూ,ఎండకు**
**ఎండుతూ**
**మట్టి మనిషిగా మారి**
**పది మందికి పట్టెడు అన్నం పెట్టే**
**రైతన్నలకు ఏటా**
**కష్టాలు,కన్నీళ్లు,నష్టాలే..**





**మర్పల్లి సెప్టెంబర్ ప్రభాతవార్త :**
వర్షాధార పంటలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు ఏటా అతివృష్టి,అనావృష్టితో పంటలు కోల్పోయి నష్టాలపాలవుతున్నారు.వర్షాలు తగ్గిన వర్షాలు ఎక్కువైన పంటలు నష్టపోయి దిగుబడి తగ్గి పెట్టుబడులు సైతం చేతికి అందడం లేదని పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మర్పల్లి మండలంలో నూటినికి తొంబై శాతం రైతులు వర్షాధార పంటలు పండిస్తారు. మండలంలో అదికంగా కమర్షియల్ పంటలైన పత్తి,మొక్కజొన్న, సోయాబిన్, పంటలను అదికంగాసాగుచేశారు.జులై మాసంలో వర్షాలు సరిగా పడక పోవడంతో పతి,మొక్కజొన్న,పంటలు సకాలంలో ఎదుగలేదు.చిరుధాన్యపు పంటలైన పెసరా, మినుము, కొర్ర,మంచినువ్వుల పంటలు పూర్తిగా నష్టపోయాయి.గత 15 రోజుల నుండి అదికంగా వర్షాలు కురవడంతో ఉన్న పంటలు సైతం అదిక నీరు చేరి పంటలు నష్టపోయాయి.ఈసంవత్సరం పంట పెట్టుబడులు సైతం చేతికి అందే మార్గం లేదని అంటున్నారు.మండలంలో నూటికి తొంబై శాతం రైతులు వర్షాధార పంటలు సాగుచేస్తారు.సాగు నీరున్న రైతులు టమాట,వంకాయ,మిర్చి,కురగాయలు సాగుచేయగా ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కూరగాయ పంటలు పూర్తిగా నష్టపోయాయి.
కొందరు అందాలం రైతులు పాతాళం: రైతులు ఆధారపడిన, మందులు, విత్తనాలు, అమ్మేవారు రైతునుండి ధాన్యాన్ని కొనేవారు.కనీసం మధ్య దళారులు అనాతి కాలంలోనే దనికులు అవుతుంటే వ్యవసాయ రంగాన్నినమ్ముకుని, రాత్రి అనక,పగలనక, సంవత్సరం పాటు శ్రమించిధాన్యం పండి స్తున్న రైతులు ధనికులు కాదు కదా ఏటా అప్పులు,కష్టాలు,నష్టాలు తప్ప మిగిలేది లేదని పలువురు రైతులు వాపోతున్నారు.

## ప్రజావాణి ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

### -మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి


.మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి ధరఖాస్తులను స్వీకరించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి,పాల్గొన్న అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త**
ప్రజావాణిలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన ధరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి 88ధరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ మనుచౌదరి ధరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగ కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రజావాణికి వచ్చి వారు ఆర్జీలు పెట్టుకోవటం జరుగుతుందని వాటిని సంబంధిత జిల్లా అధికారుల అందరు వెంటనే వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండ ప్రజావాణి ధరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. స్వీకరించిన ధరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తిరస్కరణకు గురైన వాటిని కారణాలను ఆర్జీదారులకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు డిఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి : జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి


క్రీడాకారులతో కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డిఅర్బన్,సెపెంబర్01,ప్రభాతవార్త:-**
భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో జరిగిన అండర్ 17 వరల్డ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలలో మొదటి ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ పోటీలలో మొదటి స్థానం లో బంగారం పథకం విజయం సాధించిన రంగారెడ్డి జిల్లా కు చెందిన ఇబ్రహీం పట్నం లో వాసవి జూనియర్ ఒకేషనల్ కళాశాల క్రీడాకారులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి గారు బంగారు పథకాలతో క్రీడాకారులను సన్మానించారు తదుపరి క్రీడాకారులతో మాట్లాడుతూ చెడు వన్యాసాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వాసవి విద్య సంస్థల చైర్మన్ మదారం రమేష్ గారు మరియు సీనియర్ అధ్యాపకుడు సుధాకర్ గారు సురేష్ గారు తెలంగాణ వుడ్ బాల్ కో . ఆర్డినేటర్ రహమత్ గారు మరియు రంగారెడ్డి వుడ్ బాల్ జిల్లాకి ప్రాతినిధ్యాం వహించిన క్రీడాకారులు ఆర్ కిరణ్, జె రాజేష్ ఏం మహేష్ , బి చరణ్ రిజ్వాన్ ధ్రువ చరణ్, అబ్దుల్ రెహమాన్ చంద్ర శేఖర్ జావిద్,సమీర్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

## సబ్ రిజిస్టర్ కార్యాలయం తరలించవద్దు

**రంగారెడ్డి అర్బన్,సెపెంబర్1,ప్రభాతవార్త:-** ఇబ్రహీంపట్నం లో ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయం మంఖాల్ గ్రామానికీ తరలించవద్దు అని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు మెట్టు దామోదర్ రెడ్డి అధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం ఇవ్వడం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ రిజిస్టర్ కార్యాలయం మంఖాల్ తరలిస్తే ప్రజలకు ఇబ్బందులకు గురిచేయవద్దు అని అన్నారు. కార్యక్రమములో రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్ జక్కా రంగా రెడ్డి జక్కా రాం రెడ్డి రావుల వీరేశం అబ్దుల్ లతీఫ్ హర్షవర్ధన్ వెంకటేశు వెంకట్ రెడ్డి బుచ్చయ్య గౌడ్ ఆంజనేలు గౌడ్ మరియు జిల్లా మండల నాయకులు కార్యక్రమములో పాల్గొన్నారు.

## పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ ఆందోళన


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు సెప్టెంబరు 1న విద్రోహదినంగా పాటించి ఆందోళన వ్యక్తం చేసిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబరు 1, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబరు 1వ తేదిని విద్రోహ దినంగా భావించి సిపిఎస్ వద్దు..యుపిఎస్ వద్దు అంటూ ప్రభుత్వం భేషరతుగా పాతపెన్షన్ (ఓపిఎస్) విధానాన్ని అమలు చేయాలని మేడ్చల్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద టిజెఎసి చైర్మన్ బి.రవి ప్రకాశ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీని విద్రోహదినం భాగంగ జిల్లా టిజెఎసి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు అందరు కూడ ఆందోళన వ్యక్తం చేసి నల్లదుస్తులు ధరించి నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా టిజెఎసి చైర్మన్ బి.రవిప్రకాశ్ మాట్లాడుతూ ఉద్యోగుల కష్టార్జిత భవిషత్ భధ్రతను బలిగొట్టె విధంగా సిపిఎస్, యుపిఎస్ విధానాలను ఎట్టి పరిస్థితిలో అంగీకరించేది లేదని 2004సంవత్సరంకు ముందు ఉద్యోగులకు వర్తించిన పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగుల హక్కు అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక ఆలస్యం చేస్తే మాత్రం ఉద్యోగుల ఆందోళనలు పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. జంగ్ సైరన్ మోగింది..ఇదీ ఆగదు..మరింత తీవ్రమవుతుందని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ఉద్యమ స్ఫూర్తి ప్రతి ఒక్క ఉద్యోగిలో ఇంకా రగులుతూనే ఉందని ఆ స్ఫూర్తిని ప్రభుత్వం మరవద్దని అన్నారు. అదే ఉద్యమ స్ఫూర్తితో సిపిఎస్‌ను రద్దు చేయించుకుంటామన్న ధీమాతో ఉండి స్పందించకుంటే జాప్యం చేస్తే మాత్రం సహించేది లేదని ప్రభుత్వాన్ని రవిప్రకాశ్ హెచ్చరించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల నాయకులు కూడ టిజెఎసి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిఇజెఎసి కన్వీనర్ జి.వినోద్, కలెక్టరేట్ ఎఓ రాంమోహన్, టిజిఓ కార్యదర్శి డాక్టర్ కురుమూర్తి, ట్రెసా అధ్యక్షులు సుధాకర్, టిజిఓ, టిఎన్‌జిఓస్,ఉపాధ్యాయ యూనియన్‌ల నాయకులు రవీందర్, బి.వెంకటేశ్వర్లు, యు.విఠల్, జె.ప్రేమ్‌కుమార్, జయసింహరెడ్డి,మదన్‌రెడ్డి,రాజు, శ్రీనివాస్ రెడ్డి,రాఘవేందర్,టిఎన్‌జిఓఎస్ జిల్లా కార్యదర్శి భరత్‌కుమార్, కోశాధికారి శేషసాయి గిరికాంత్, అశ్విని, సుధీర్, కార్తీక్, కిషోర్, ఖజాంచి, అక్షయ్,లక్ష్మిప్రసన్న, చందు, లక్ష్మయ్య, శ్రీనివాస్, రవియాదవ్, అరుణ, నసీమ, సత్యజ్యోతి, మాణిక్యం, శ్రీనివాస్, మల్లారెడ్డి,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.

# యూరియా ఏదయా

**-యూరియా కోసం రైతుల ఇక్కట్లు !**
**-సొమ్మసిల్లి పడిపోయిన జనగాం రైతు**
**-చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు**


యూరియ కోసం ఎగబడ్డ రైతులు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు

**పెద్దేముల్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:** ఆరుగాళం కష్టించి అన్నం పెట్టె రైతన్నకు యూరియ ఇబ్బందులు తప్పడంలేదు. యూరియ కోసం ఉదయం నుంచిసాయంత్రం వరకు వరుసలో నిలబడిన దొరికడం కష్టంగా మారింది. పంటకు కావలసినంతా ఇవ్వకుండా ఒకటో, రెండో బస్తాలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. యూరియ కోసం లైన్‌లో నిలబడటమే కాకుండా వెనుక, ముందు నుంచి తొయ్యడంతో రైతుల ఇక్కట్లు వర్ణనాతీతం, సోమవారం పెద్దేముల్ సోసైటిలో200 యూరియ బస్తాలు వచ్చాయి. అట్టి యూరియ కోసం ఉదయం 7 గంటల నుంచి సోసైటి ముందు రైతులు పడిగాపులు కాసారు. ఒక్కో రైతుకు ఒక బస్తామాత్రమే ఇచ్చారు. అందుకు వరుస క్రమంలో నిలుచున్న జనగాం గ్రామానికి చెందిన రైతు బిల్లిపురం మల్లప్ప సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో అక్కడే ఉండి గమనించిన పోలీసులు, స్థానికులు పెద్దేముల్ పిహెచ్‌సికి తరలించారు. దీంతో ఆయా గ్రామాల చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైతులకు సరిపడాయూరియ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. చాలిచాలనంతా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత సంవత్సరం 6040 బస్తాల యూరియ రాగా, ప్రస్తుత సంవత్సరం 5074 బస్తాల యూరియ వచ్చిందని సోసైటి మేనేజర్ మురళి తెలిపారు.

## తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయండి

### - కలెక్టర్ నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతూన్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**రంగారెడ్డి అర్బన్,సెపెంబర్1,ప్రభాతవార్త:-**
తుది ఓటర్ల జాబితాను ఎలాంటి తప్పులు లేకుండా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆర్డీఓలు, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల వారిగా ఓటరు లిస్టును పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు వుంటే వెంటనే పరిష్కరించాలని, ముఖ్యంగా నకిలీ ఓటర్లతో తప్పుల తడకగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, కావున ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బంధీగా తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఎక్కడైనా జాబితాపై ఫిర్యాదులు వస్తే సరి చేయాలన్నారు. ఎక్కడైనా తప్పులు ఉన్నట్లు అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల ఏర్పాట్లలో ఎక్కడా కూడా జాప్యం జరగొద్దని, పోలింగ్ బూత్లకు సంబంధించి ఎక్కడైనా శిథిలావస్థలో భవనాలు ఉంటే గుర్తించి మరో చోటకు తరలించాలని, పోలింగ్ స్టేషన్ దూరంగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తే సమీప ప్రాంతంలో అదనంగా మరో స్టేషనన్ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అదే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డబుల్, నకిలీ ఓట్లను, చనిపోయిన వారిని గుర్తించి వెంటనే ఓటర్ల జాబితా నుంచి వారంలోగా తొలగించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.టెలీ కాన్ఫరెన్స్లో డీపీఓ సురేష్ మోహన్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

## మాల్ గ్రామపంచాయతీని సందర్శించిన ఇతర రాష్ట్రాల అధికారులు



**యాచారం సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**
ఎక్స్పోజర్ విజిట్ లో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రజా ప్రతినిధులు అధికారులు మాల్ లో ఆత్మ నిర్భయాన్ పంచాయతి అవార్డు పొందిన సందర్భంలో సందర్శన సోమవారం సందర్శించారు. గ్రామపంచాయతీ యొక్క పరిపాలన ,టాక్స్ కలెక్షన్, ఖర్చులు,పశువుల సంత నిర్వహణ గ్రామపంచాయతీ రికార్డులు పైన అవగాహన కల్పించారు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనం, పశువుల సంత జరిగే స్థలం చూడడం జరిగింది. కార్యక్రమంలో టిఎస్ఐపిఆర్డ్ నుండి అధికారులు కె.అనిల్ కుమార్, సిడిపిఏ, ఎల్ పి ఓ స్మిత, ఎంపీడీవో రాధా రాణి, ఎంపీవో శ్రీలత, కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

**కొడంగల్ రూరల్, సెప్టెంబరు 1 (ప్రభాతవార్త):** వినాయక చవితి సందర్భంగా కొడంగల్ పట్టణంలోని లాహోటీ కాలనీలో ప్రతిష్ఠించిన గణనాథుడికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. పూజల్లో భాగంగా స్థానిక నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినాయక మండపం దగ్గర నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పాఠశాల యజమాన్యం పాల్గొన్నారు.

## ఎస్ఆర్ యూత్ గణనాధునికి ఇన్‌స్పెక్టర్ల పూజలు



ఎస్ఆర్ యూత్ గణపతి పూజలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, రాజు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ పట్టణంలోని ఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరస్వామికి పోలీసు అధికారులు పూజలు చేశారు. ఎస్ఆర్ యూత్ నిర్వహకులు పల్లె విజయ్‌గౌడ్ విజ్ఞప్తి మేరకు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, పోచారం ఐటీసీ ఇన్‌స్పెక్టర్ బి.రాజువర్మ, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌లు విచ్చేసి గణపతిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారికి వినాయకస్వామి తీర్థ, ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ కోప్షన్ సభ్యురాలు పల్లె అరుణ, యూత్ సభ్యులు రాధాకృష్ణారెడ్డి, పల్లె సదాశివులుగౌడ్, పల్లె సంజయ్ గౌడ్, ప్రదీప్, నితిన్, సల్మాన్, అజయ్, భరత్, మల్లిఖార్జున్, సలామ్, ఆది, సుమి, సుషీ, అక్షయ్, హరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపం వద్ద లోకకళ్యాణార్థం శ్రీగణపతి హోమం



స్వామి వివేకానంద యూత్ గణేశ్ మండపం ఆవరణలో హోమంలో పాల్గొన్న దంపతులు

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ కమ్యూనిటీహాలు ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపం ఆవరణలో సోమవారం గణపతి హోమం నిర్వహించారు. స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతిని ప్రతిష్టించి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అర్చకులు జాగర్లపూడి భవానీ శంకర్ మంత్రోచ్చారణాల మధ్య ఇడబ్ల్యుఎస్‌కాలనీకి చెందిన పలువురు దంపతులు గణపతి హోమంలో పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ బర్ల శశికళ దేవేందర్, కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి శశిధరణ్, మాజీ వార్డుసభ్యులు సోమసాని రమేశ్ పెరిక, దంతాల అనిల్‌కుమార్, అబ్బగోని నందగోపాల్‌గౌడ్, శివరాత్రి సురేశ్ దంపతులు హోమంలో పాల్గొన్నారు. హోమంలో ఆవునెయ్యి, సుగంధ ద్రవ్యాలు, చంధనం, వస్త్రం, పసుపు, కుంకుమ తదితర పూజా ద్రవ్యాలను అగ్నిహోత్రంలో వేసి పూర్ణాహూతి చేశారు. మున్సిపల్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, దంతాల వెంకటయ్య, దంతూరి గోపాల్‌గౌడ్, బర్ల సహదేవ్, వంశీకృష్ణమోహన్, తరుణ్, సన్నీ, శ్రీను, అభిరామ్, మెంటు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన టిహెచ్‌యుటిఎ అధ్యక్షుడికి శుభాకాంక్షలు వెల్లువ



**అత్తాపూర్ సెప్టెంబరు1,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిసరాలలో గల కూరగాయల పరిశోధన కేంద్రం కార్యాలయంలో తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ టీచింగ్ అసోసియేషన్ (టిహెచ్‌యుటిఎ) అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన డాక్టర్ బి. సాయి కృష్ణ నిఖిల్‌కి విద్యార్థి సంఘ నాయకులు కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ – డాక్టర్ సాయి కృష్ణ నిఖిల్ విశ్వవిద్యాలయానికి ఎంతో సేవచేయగల సామర్థం గలవారని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల మధ్య వారధిగా నిలుస్తారని, విశ్వవిద్యాలయం అభివృద్ధి దిశగా కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతారని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమం, పరిశోధన ప్రోత్సాహం, నూతన సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ, ఉద్యానవన విద్యా ప్రమాణాల పెంపు వంటి అంశాలలో కొత్త అధ్యక్షుడు ప్రత్యేక దృష్టి సారిస్తారని విద్యార్థి సంఘం నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ ప్రతినిధులు, పలు విభాగాల విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు పాల్గొని సాయి కృష్ణ నిఖిల్ గారికి పూలగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొండ లక్ష్మణ్ జన విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం అధ్యక్షుడు నాగులపల్లి సంగారెడ్డి , సాయికిరణ్, తరుణ్ రెడ్డి , చికిల్ రెడ్డి, సోనీ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా పేదల వైద్యానికి ఆర్థికసాయం అందుతుందని గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరక్టర్ చిల్కూరి మచ్చేంధర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌కు చెందిన బండారి భాగ్యలక్ష్మికి ఆయన సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. భాగ్యలక్ష్మి అనారోగ్యంతో ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి ధరఖాస్తు చేసుకుంది. మేడ్చల్ కాంగ్రెస్ ఇంచార్జ్ తోటకూర వజ్రేశ్‌యాదవ్ సహకారంతో సీఎం సహాయనిధి నుంచి రూ.17,500లు చెక్కు మంజూరు కాగా మార్కెట్ డైరక్టర్ మచ్చేందర్‌రెడ్డి భాగ్యలక్ష్మికి అందేశారు.



డా. బీ ఆర్ అంబేడ్కర్ నగర్‌లో వినాయకుడి పూజలో పాల్గొన్న వర్రీ లలిత్ , శ్రీకాంత్ ముడిమల , ఆవుల సుధీర్ ,గొడుగు సంజీవ, దళిత రత్న గ్రహీత పత్యార నరసింహ,మల్కారం చిమ్మ ఆవుల అజయ్,తదితరులు

# రెవెన్యూ అధికారులు కాలయాపన వీడాలి...

-సిపిఎం పార్టీ కార్యదర్శి కె.రవీందర్

**గుమ్మడిదల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంలో అధికారు విఫలమయ్యారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కె. రవీందర్ డిమాండ్‌చేశారు. సోమవారం గుమ్మడిదల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఎన్నడు సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రోజూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులకు గురవుతున్నారని కేవలం రెవెన్యూ అధికారులు ఆర్డీవో కార్యాలయంలో భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతుల రెవెన్యూ సమస్యలు తక్షణమే చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. తహసీల్దార్ ప్రత్యేకచొరవ తీసుకొని భూభారతిలో రైతు రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామనీ, నేటికి దరఖాస్తులు చేసుకొని మూడునెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్కసమస్య అయినా పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. కేవలం తహసీల్దార్ రెవెన్యూ కార్యాలయంలో ఉండడంతో భూభారతిలో దరఖాస్తులు చేసుకున్న రైతుసమస్యలు పరిష్కారం కావని జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రత్యేకచొరవ తీసుకొని రైతుల రెవెన్యూ సమస్యల దరఖాస్తులను పరిశీలించి వెంటనే సమస్యలు పరిష్కరించే దిశగా తగిన చర్యలు చేపట్టాలని కోరారు.



తహసీల్దార్ కార్యాలయం, సిపిఎం పార్టీ కార్యదర్శి కె.రవీందర్ దృశ్యం

## ప్రధాన రహదారిపై గుంతలు ఎమ్మెల్యే సొంతనిధులతో పూడ్చివేత



రోడ్డు మరమ్మతు చేస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

కానుకుంట గుమ్మడిదల ప్రధాన రహదారి గుంతలమయం కావడంతో ప్రాంత ప్రజలు విన్నపాలను విన్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రహదారినిపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టడానికి సోమవారం తమ సొంతనిధులను వెచ్చించి తాత్కాలికంగా గుంతలుపూడ్చే కార్యక్రమాన్ని మాజీ జడ్పిటిసి కుమార్‌గౌడ్, వారి మిత్రులతో కలిసి ట్రాక్టర్, డోజర్‌లతో రోడ్డును చదును చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కనీసం ఇన్ని రోజులకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని తన సొంత నిధులు వెచ్చించి రోడ్డు పనులను ప్రారంభించినందుకు రహదారి గుండా పయనించే ప్రజలు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అట్లాగే ప్రభుత్వం నిధులతో రోడ్డు పునర్నిర్మాణపనులు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

## ఆశావర్కర్ల ముందస్తు అరెస్టు



పోలీసులు ముందస్తుగా అరెస్టుచేసిన ఆశావర్కర్లు

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాలలో పనిచేస్తున్న ఆశా వర్కర్లను చిన్నశంకరంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చలో హైదరబాద్ ధర్నాకు వెళ్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం అరెస్టు చేయడం అమానుషమని ఆశా వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు దేవమ్మ అన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. ఆశా వర్కర్లు లలిత, కవిత, వనిత, రేణుకలు ఉన్నారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే

–టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

బిసి రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీదేనని టిపిసిసి ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఈవిషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీశ్రేణులకు సూచించారు. బిసి రిజర్వేషన్లకు హీరోలుగా ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లను నిలబెట్టాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రెండు సవరణబిల్లులను శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదించిన నేపథ్యంలో.. సోమవారం అనిల్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న కెసిఆర్.. బిసిలను అణగదొక్కారని ఫైర్ అయ్యారు. సవరణబిల్లులను తెచ్చి బిసిలకు రాజకీయంగా సుస్థిర స్థానం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌పార్టీకే దక్కుతుందన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో సిఎం రేవంత్, మంత్రులు చిత్తశుద్ధితో పనిచేశారని పేర్కొన్నారు. ఈవిషయాన్ని కాంగ్రెస్‌నాయకులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిచోట్లా కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. 20నెలల కాంగ్రెస్ పాలనలో చేసిన ప్రజాపాలన, అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలు, బిసి రిజర్వేషన్లు పెద్ద ఎత్తున కిందిస్థాయి వరకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## చెరువుకట్టను పరిశీలించిన ఆర్‌డిఓ



అల్లాదుర్గంలో పగిలిన చెరువుకట్టను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రమాదేవి

**అల్లాదుర్గం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు పగిలిపోయిన బట్టికుంట చెరువుకట్టను సోమవారం మెదక్ ఆర్‌డిఓ రమాదేవి పరిశీలించారు. చెరువుకట్ట తెగిపోవడంతో అటుగా సాగవుతున్న పంటలు నీటి పాలవడంతోపాటు బిటి రోడ్డు తెగిపోయిన విషయం పాఠకులకు విదితమే. చెరువుకట్ట తెగిపోయినట్లు తెలుసుకున్న ఆర్‌డిఓ రమాదేవి సోమవారం తెగిన చెరువుకట్టను పరిశీలించి కట్ట మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. చెరువుకట్ట మరమ్మతులకు ప్రత్యేకచొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలరాం, నాయకులు బేతయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వినతి

–తెలంగాణ జిల్లా రైతు రక్షణసమితి కమిటీ



వ్యవసాయాధికారి దేవికుమార్‌కు వినతి అందజేసిన రైతురక్షణసమితి కమిటీసభ్యులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

జిల్లాలో కురిసిన అకాలవర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా వ్యవసాయ అధికారి దేవికుమార్‌కు జిల్లా రైతు రక్షణసమితి కమిటీ వినతిపత్రం సమర్పించారు. సోమవారం తెలంగాణ రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని వినతి. జిల్లా రైతురక్షణసమితి అధ్యక్షులు పత్రాల యాదగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు అక్కమ్మొల్ల మైసయ్య యాదవ్‌ల ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి దేవి కుమార్‌ను మర్యాదపూర్వకంగాకలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కురిసిన అకాలవర్షాలకు దెబ్బతిన్న పంటలకు మండలాల వారీగా అధికారులతో సర్వే చేయించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈమేరకు మండలాల వారీగా ప్రతి సొసైటీకి రెండు లారీల యూరియాను సరఫరా చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో రైతురక్షణసమితి జిల్లా ఉపాధ్యక్షులు అంతంగారి వెంకటేష్, కార్యదర్శులు నరేందర్, రమేష్‌యాదవ్, శ్రీకాంత్, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

–ప్లాస్టిక్ నిషేధం, వాడకంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, వాటి వాడకం వలన కలిగే నష్టాలు, నివారణ చర్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి 100రోజుల కార్యక్రమంలోభాగంగా నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి ఆదేశాలమేరకు ఘనవ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్‌వాడకం వల్ల కలిగే నష్టాలను, నివారణచర్యలపై ఆపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వార్డు అధికారి ఉదయ్‌కుమార్, జవాన్, అశోక్, మున్సిపల్‌సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వీధి వ్యాపారాలు చేయవద్దు

-వీధివ్యాపారులకు అవగాహన కల్పించిన మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్ఐ లింగం



వీధి వ్యాపారస్థులకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్ఐ లింగం

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** నర్సాపూర్ బస్టాండ్ ఏరియాలో మెయిన్ రోడ్డుపై వీధి వ్యాపారాలు చేయవద్దని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్సై బి.లింగం అన్నారు. సోమవారం నర్సాపూర్ బస్టాండ్‌లో వారు పర్యటించి రోడ్డుపైన వ్యాపారాలు చేసుకుంటున్నవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపైన వీధి వ్యాపారాలు చేసుకున్నట్లయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఇటీవల కాలంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈమేరకు వీధి వ్యాపారస్థులు రోడ్డుపైన కాకుండా గ్రిల్ లోపల పాదచారులకు ఆటంకం కలగకుండా చిరు దుకాణాలను, పండ్ల బండ్లను పెట్టుకొని వ్యాపారం చేయవచ్చని సూచించారు. ఎవరైనా ఈ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్‌చరణ్‌రెడ్డి, ఎస్సై బి.లింగంతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దుకై ధర్నాకు పిఆర్టీయు నాయకులు



ప్లకార్డులతో ధర్నాకు బయలుదేరిన పిఆర్టీయు నాయకులు

**కొల్చారం, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

పిఆర్‌టియు రాష్ట్రశాఖ పిలుపు మేరకు కూల్చారం మండలం నుండి మండల అధ్యక్షులు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్‌లోని ధర్నా కార్యక్రమానికి భారీగా వెళ్లడం జరిగింది. మండల ప్రధాన కార్యదర్శి కర్ణాకర్, మాజీ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, దుర్గయ్య, ఎగొండ, గణేష్, సందీప్, వెంకట నర్సింలు, అరవింద్, దుర్గాప్రసాద్, సిపిఎస్‌ని ప్రభుత్వం వెంటనే రద్దుచేసి ఓపిఎస్‌ని ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది.

## మాతృమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు

**పాపన్నపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

బీహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాతృమూర్తిపై అనుచితమైన, అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించి విమర్శించినందుకు నిరసనగా మండల కేంద్రమైన పాపన్నపేటలో బిజెపి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు. బీహార్‌లో బిజెపి హవా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో జీర్ణించుకోలేక అడ్డగోలువ్యాఖ్యలు చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిరసన కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు రాములు, సంతోష్, నాగభూషణం, సుధాకర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెగట్టులో రేషన్ కార్డుల పంపిణీ

**మునిపల్లి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

మునిపల్లిమండలం గొర్రెగట్టుగ్రామంలో రాష్ట్రమంత్రివర్యులు దామోదర రాజనరసింహ ఆదేశానుసారం సోమవారం నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేయడం జరిగింది. పదేళ్లుగా రేషన్ కార్డులు అందజేయకుండా బిఆర్ఎస్ నాయకులు కాలయాపన చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు అందజేసి పేదలకు న్యాయంచేసిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ అమరేశ్వర్, మాజీ ఎంపిటిసి పాండు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ వీరన్నపాటిల్, గ్రామ పెద్దలు గంగన్న, వీరన్న, టేకూరి వీరన్న, కృష్ణ, మల్లయ్య, శివరాజ్, నవీన్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా నవరాత్రి ఉత్సవాలు

–వసంత్‌నగర్‌లో ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన

**జహీరాబాద్, సెప్టెంబరు 1, ప్రభాతవార్త:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని ఆయా కాలనీల్లో కొలువుదీరిన గణనాథులను ప్రజలు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. ఆదివారంరాత్రి పట్టణంలోని వసంత్‌విహార్ కాలనీలో చిన్నారి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా మండపాలకు ఆయా రాజకీయపార్టీల నాయకులు నిత్యం దర్శించుకుంటున్నారు. వసంత్‌విహార్‌లో వినాయకమండపంవద్ద నిర్వహించిన లడ్డూవేలంలో లడ్డూను రూ.6600కు భక్తులు దక్కించుకున్నారు.

## గంగమ్మ ఒడికి గణపయ్య

**కంగ్టి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

మండలంలోని రాజారామ్ తాండలో శ్రీసేవగణేష్‌మండలి తరపున వేలం పాటను ఆదివారంరాత్రి నిర్వహించారు. తాండవాసులు వేలంపాటలో పాల్గొని ప్రసాదం లడ్డూను జాదవ్ రమేష్ 22,100 రూపాయలకు, అదేవిధంగా చవాన్ కిషన్, రాథోడ్ లక్ష్మణ్, బర్దల్ జైషింగ్, రాథోడ్ పర్సురామ్‌లు ఒక్కొక్కరు, ఒక్కొక్క ప్రసాదాన్ని స్వీకరించారు. వీరికి గ్రామ ఆలయపూజారి శ్యామ్‌రావ్ మహారాజ్, గ్రామపెద్దలు మాజీ సర్పంచ్ ఖీరునాయక్, మాజీ ఎంపిటిసి గంగారాం, గోత్తి సదాశింగ్, జైరాంలు, తాండ శ్రీసేవగణేష్ యూత్‌మండలి తరపున ప్రసాదాన్ని అందించారు. తాండలో వినాయకమండపం వద్ద అన్నదానం ఏర్పాటుచేసి అందరికి పంచిపెట్టారు, సోమవారం గిరిజన మహిళలు గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చారు.

## మండల అధికారుల రివ్యూ సమావేశం..

**కంగ్టి, 1 సెప్టెంబర్, ప్రభాతవార్త:**

మండల పరిషత్తు సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్స్ ఫీల్డ్ అసిస్టెంట్స్ మేట్స్, ఎపివో ఈసి ఎంపిఓలతో కింది అంశాలపై రివ్యూ సమావేశము నిర్వహించడం జరిగింది. ఉపాధి హామీలో ప్లాంటేషన్ ఆక్టివిటీస్ పనులజాతరలో చేపట్టిన పనులు పూర్తి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రైమ్ మినిస్టర్ ఆవాస్ యోజన యాప్‌ని అప్డేట్ చేయడం గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్ లిస్టు కన్ఫర్మేషన్ వంటి విషయాలన్నింటిపైన సుదీర్ఘంగా చర్చించి తగిన ఆదేశాలు ఇచ్చి వెంటనే పనులన్నింటినీ పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. ముఖ్యంగా మొక్కలు నాటడం పని పూర్తి చేయాలి. పేమెంట్ చేయాలి. అలాగే పనుల జాతర కార్యక్రమంలో చేపట్టిన క్యాటిల్ షెడ్ నిర్మాణము, గోట్ షెడ్డు నిర్మాణము, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణం, సోక్ పిట్స్ నిర్మాణం లాంటి పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించడం జరిగింది. ఇంకా వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు అందరూ గ్రామాలలో పరిశుద్ధ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు రాకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపిడివో ఎం.సత్తయ్య, ఎంపివో సుభాష్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**నర్సాపూర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామంలోని నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌడిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం 1, కౌడిపల్లి డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పిజి సబ్జెక్టులో 50శాతం మార్కులు కలిగి ఉండి ఎస్ఈటి, ఎన్ఈటి, పిహెచ్‌డితోపాటు అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 2,3 తేదీలలో సాయంత్రం 4 గంటలన్నర లోపు కళాశాలలో అందించాలన్నారు. ఈ నెల 4వతేదీన ఒరిజినల్ సర్టిఫికెట్లతో మెదక్ డిగ్రీ కళాశాలలో డెమోకు హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

# రోడ్డు పనులు పూర్తి చేయండి

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబర్ , 1,ప్రభాతవార్త:** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ గ్రామం నుంచి జిల్లెడు గ్రామంలో వెల్లే రోడ్డు పనులు పూర్తి చేయాలని జిల్లెడు మాజి సర్పంచ్ బాబురావు కోరారు. రోడ్డు నిర్మాణం చేసే సమయంలో దాదాపు 60మీటర్ల వరకు రోడ్డు నిర్మాణం చేయలేదని ఆయన అన్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగ మారిందని ఆయన పెర్కొన్నారు. రోడ్డు గుంతల మయంగ మారడం వల్లన వాహన దారు, ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిఎపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు.

## కల్వకుర్తి బస్సు పునః ప్రారంభించాలని వినతి

**యాచారం, సెప్టెంబర్1, ప్రభాతవార్త**

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రాజాపాలనలో కల్వకుర్తి డిపో నుంచి నడిచే బస్సులను కరోనా సమయంలో రద్దు చేశారని ఆ బస్సులు పున ప్రారంభం చేయాలని ప్రొద్దుటూరు రవీందర్ గుప్తా ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరు రవీందర్ గుప్త కలెక్టర్ కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సంద్బంగా రవీందర్ గుప్తా మాట్లాడుతూ.. కల్వకుర్తి డిపో నుండి బస్సులు బంద్ తో మేడిపల్లి నక్కర్త , పల్లె చెల్కతండ , ముద్విన్ , ఆకుతోటపల్లి,శేటిపల్లి, గౌరం, గ్రామ ప్రజల ఐదు సంవత్సరాలుగా కల్వకుర్తి డిపో నుంచి ఆమనగల్ , మేడిపల్లి మాల్, మేడిపల్లి హైదరాబాద్, మేడిపల్లి మాల్ ఆమనగల్ నైట్ హాల్ట్ బస్సులు బంద్ చేయడంతో ప్రజలు రైతులు విద్యార్థులు మహిళలు యువకులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ బస్సులు పున: ప్రారంభం చేయాలని కల్వకుర్తి డిపో మేనేజర్ కు, మహబూబ్నగర్ ఆర్ ఎం,కల్వకుర్తి ఎంఎల్ఏ కు , తెలంగాణ ఆర్టీసీ ఎండి సజ్జనర్ కు, ఇబ్రహింపట్నం ప్రజా పాలనలో కూడా గత సంవత్సరం డిసెంబర్ లో వినతి పత్రాలు ఇచ్చిన అధికారుల స్పందన లేదని, ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని మా సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోడ కృష్ణ, పొద్దుటూరి రవీందర్ గుప్తా, వడ్డెమోని నరేష్, బన్నె శ్రీశైలం,జల నాగరాజ్, ముంత శ్రీను, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళాకారులు మద్దెల సత్యనారాయణకు సత్కారం



రవీంద్ర భారతిలో మద్దెల సత్యనారాయణను సన్మానిస్తున్న దృశ్యం

**యాచారం,సెప్టెంబర్ 1, ప్రభాతవార్త**

యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన మద్దెల సత్యనారాయణ వృత్తిరీత్యా విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తారు. ఉద్యోగరీత్యా విధులు నిర్వహిస్తూనే జానపద కలలు విధి నాటకాలలో మక్కువతో పాల్గొని ప్రజలను చైతన్య పరుస్తారు.గత రెండు నెలల క్రితం శ్రీ వెంకటేశ్వర వీదీ నాటకం వైభవంగా నిర్వహించారు. సత్యనారాయణ వెంకటేశ్వర పాత్రలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తూ ఎంతగానో అలరించారు. సాంప్రదాయాలను కాపాడుతూ వీధి నాటకాల ద్వారా ప్రజలను చైతన్యవరుస్తూ పేరు ప్రఖ్యాతలు సాధించారు. సత్యనారాయణ కళలను రవీంద్ర భారతి వారు గుర్తించిన జానపద జాతర ముగింపు వేడుకలలో రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చెంచు లింగయ్య చేతుల మీదుగా అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. జీవిత మనే నాటకంలో మానవ జీవన విధానాన్ని ప్రాచీన సాంప్రదాయాలను సంస్కృతిని కాపాడడంలో వీధి నాటకాలు జానపద గీతాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ప్రజలు ఆధునిక యుగంలో ప్రాచీన సంప్రదాయాలను మరో మారు బయటకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కళా నైపుణ్యాన్ని గుర్తించి సన్మానం చేసిన పెద్దలకు సంబంధించిన వ్యక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 69వ ఎస్‌జిఎఫ్ శామీర్‌పేట జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



జగ్గంగూడలోని జీనియస్ స్కూల్‌లో 69వ ఎస్‌జిఎఫ్ శామీర్‌పేట జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభమైన దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త**

జగ్గంగూడలోని జీనియస్ గ్రామర్ హైస్కూల్‌లో 69వ ఎస్‌జిఎఫ్ శామీర్‌పేట జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఉమ్మడి మండలాల ఎంఇఓలు కమలాకర్,భాగ్యమణి, పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి,ప్రిన్సిపల్ కల్పనారెడ్డి,జోనల్ సెక్రటరీ గుర్రం సత్తిరెడ్డిలు పాల్గొని లాంఛనంగ ప్రారంభించారు. సోమవారం మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ గ్రామంలోని జీనియస్ గ్రామర్ హైస్కూల్‌లో ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలను వారు ప్రారంభించారు. మూడు రోజుల పాటు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ అండర్-14, అండర్ -17 బాలబాలికలకు క్రీడాపోటీలు జోనల్ లెవల్ టోర్నమెంట్స్ కమ్ సెలక్షన్స్ కోసం ఈ పోటీలు జీనియస్ స్కూల్ గ్రౌండ్ లో నిర్వహిస్తున్నామని జోనల్ సెక్రటరీ గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. విద్యార్థులు క్రీడారంగంలోనూ రాణించాలని, చదువుతో పాటు క్రీడలు కీలకమని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు నాగలక్ష్మి, గోపాల్‌చారి, జ్యోతి, మదన్‌మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, శ్వేతలు పాల్గొన్నారు. అయితే ఈ పోటీల్లో 180జట్లు, సుమారు క్రీడాకారులు 2200మంది వరకు పాల్గొనటం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ క్రీడాపోటీల్లో ఉత్సాహంగ పాల్గొంటున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ క్రీడాపోటీలు జరుగనున్నాయి.

## అరకొర యూరియాతో రైతన్నలకు అష్ట కష్టాలు



**కేశంపేట సెప్టెంబర్ 1,ప్రభాతవార్త :** అరకొర యూరియా తో రైతన్నలు అష్ట కష్టాలు పడుతున్న ఘటన కేశంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం కేశంపేట మండల కేంద్రంలో యూరియా స్లిప్పుల కోసం కేశంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బారులు తీరారు సరిపడ యూరియా లేక రైతులు పెద్ద మొత్తంలో రావడంతో పంచాయతీ కార్యాలయం ముందు కొంత తోపులాట జరిగింది. అక్కడికి చేరుకున్న మండల వ్యవసాయ అధికారిని శిరీష. ఘటన స్థలానికి కేశంపేట సిఐ నరహరి తన సిబ్బందితో వెళ్లి రైతులకు సర్ది చెప్పారు, యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో కొంత ఇబ్బంది కలిగిందని వ్యవసాయ అధికారిని శిరీష జిల్లా వ్యవసాయ అధికారికి ఫోన్లో సమాచారం అందించారు. కేశంపేట మండలానికి త్వరలోనే యూరియా అందిస్తామని జిల్లా అధికారి హామీ ఇచ్చినట్లు వ్యవసాయ అధికారిని శిరీష రైతులకు సర్దిచెప్పి పంపించారు. దీంతో స్లిప్పులు ఉన్న రైతులు క్యూ లైన్ లో నిలుచుని యూరియాను తీసుకువెళ్లారు.

# జిల్లాలో కొత్తగా 14గ్రంధాలయాల ఏర్పాటుకు తీర్మానం

**-మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు**

**-మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి**



శామీర్‌పేట ఉమ్మడి మండల ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి,పాల్గొన్న మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, మాజీ సర్పంచు డి.వెంకటేశల దృశ్యం

**శామీర్‌పేట, సెప్టెంబరు 1, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా మరో 14కొత్త గ్రంధాలయాల శాఖల ఏర్పాటుకు తీర్మాణం చేసి ప్రభుత్వాన్ని మంజూరు కోరుతూ ప్రతిపాదనలు జిల్లా నుంచి పంపినట్లు మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శామీర్‌పేట ఉమ్మడి మండల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా 18 గ్రంధాలయాల పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లా జనాభాను దృష్టిలో ఉంచుకుని మరో 14కొత్త గ్రంధాయాల ఏర్పాటుకు తీర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. మేడ్చల్ జిల్లా ప్రజల అవసరాలను తీర్చటానికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేయనున్నారని అన్నారు. త్వరలోనే జిల్లాలో మరో 14 కొత్త గ్రంధాలయాలకు ప్రభుత్వ అనుమతి రానుందని అన్నారు. మధ్యంతరంగ ఆగిపోయిన కీసర గ్రంధాయల భవనాన్ని ప్రారంభించుకోవటంతో పాటు భవనాలు పూర్తి అయిన దేవరయాంజాల్, అలియాబాద్ శాఖా గ్రంధాలయాను త్వరలో ప్రారంభించుకోవటం జరుగుతుందన్నారు. పాఠకులకు ప్రాధాన్యతను ఇస్తూ గ్రంధాలయాలను ఏర్పాటు చేసుకోవటం జరుగుతుందన్నారు. పాఠకులకు కావలసిన పుస్తకాలు వారిని అడిగి తెలుసుకుని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్,మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు,మాజీ సర్పంచు దోసకాయల వెంకటేశ తదితరులు పాల్గొన్నారు.

# బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలి

**-కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టర్ల ఆందోళన**

**-ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1, ప్రభాతవార్త**

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాల్టీల్లో విలీనానికి ముందు గ్రామపంచాయతీలుగ ఉన్న వాటిలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు, బిల్లులు బకాయిలు ఉన్నట్లు, మరి కొన్ని రికార్డు కాని పనులు ఉన్నాయని ఈ సమస్యను కూడ పరిష్కరించాలని కీసర మండలంలోని పలువురు కాంట్రాక్టర్లు మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాదికగుప్తాను కలిసి కోరారు. సోమవారం మేడ్చల్ జిల్లాలోని కీసర మండలంలోని పలువురు కాంట్రాక్టర్లు జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసి ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాను కలిసి బకాయి బిల్లుల గురించి, పలు పనుల రికార్డుల ఎంబిల గురించి ఎదుర్కొంటున్న సమస్య గురించి వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీలుగ ఉన్న సమయంలో తాము అభివృద్ది పనులు చేశామని, బకాయిబిల్లులు రావాల్సి ఉందని, కొన్ని ఎంబి రికార్డు బుక్స్ తమ వద్ద ఉన్నాయని వాటిని ఆ పనులను రికార్డులో చేర్చాలని కోరుతూ వాటిని సమర్పించారు. ప్రస్తుతం అభివృద్ది పనుల ఎంబి బుక్స్ పూర్తి స్థాయిలో రికార్డు చేయబడినట్లు, రికార్డులలో చేర్చివాటికి సంబంధించిన బకాయిపేమెంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరారు. అయితే ఎంబి బుక్స్ మీకు ఎవరు ఇచ్చారని, పంచాయతీ కార్యదర్శి గంగన్న కాంట్రాక్టర్లకు ఎంబి బుక్స్ ఎందుకు ఇచ్చారని,ఎందుకు మీ వద్ద ఉంచుకున్నారని వాటిని తీసుకుని ఇన్‌చార్జి డిపిఓ సాంబశివరావుకు ఇచ్చారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ది పనుల బిల్లులు చెల్లించాలని ఆమెను పలువురు కాంట్రాక్టర్లు కలిసి కోరారు. దీనిలో ఎస్.నర్సింహ్మాచారి, ఏ సుభాష్, పి.శ్రవణ్‌రెడ్డి, ఈ .కృష్ణ, ఆర్.రాంరెడ్డి, పలువురు కాంట్రాక్టర్లు ఎంబిలను సమర్పించారు. ఈ సమస్యను పరిష్కరించి తమ బకాయిల చెల్లింపులు జరిగేలా చూడాలని వారు అదనపు కలెక్టర్‌ను,సంబంధిత అధికారులను కోరారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద కాంట్రాక్టర్లు బకాయి బిల్లులు చెల్లించాలని ఆందోళన వ్యక్తం చేసిన దృశ్యం

# రసాయన వ్యర్థాలతో చెరువులో చేపలు మృత్యువాత

**-నష్టంపై ప్రభుత్వానికి నివేదిక: డిఎఫ్ఓ సుకీర్తి**

**-కలుషిత జలాలలో పంటలు, చేపలకు చేటు: వైఎస్ఆర్**

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** రసాయన వ్యర్థాలతో ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎరుమల్లెవాగు ద్వారా వరదనీరు వచ్చి లక్ష్మీనారాయణ చెరువులో చేరింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు, చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతాల నుంచి రసాయన వ్యర్ధ జలాలను వదిలిపెట్టడంతో ఒక వైపు బొంతకుంట, మరోవైపు ఎరుమల్లెవాగుల ద్వారా చెరువులో కలుస్తున్నాయి. గతంలో మత్స్యకారులు చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన చేపపిల్లలను వదిలి పెట్టగా అవి ఇపఉ్పుడు పెద్దగా మారాయి. ఒక్కో చేప కిలో నుంచి 5 కిలోల వరకు ఉండగా కాలుష్యకాటుకు గురై చనిపోయాయి. చనిపోయిన చేపలు గాలిఅలలకు ఘణాపూర్ వైపు చెరువు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. స్థానికులు, గంగపుత్ర సంఘం సభ్యులు చూసి అధికారులు, మాజజీ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి, సిబ్బందితో పాటు చేరుకొని చనిపోయిన చేపలను పరిశీలించారు. చెరువులో నీటినమునాను సేకరించి ప్రయోగశాలకు పంపించి విషతుల్యమైన పదార్థాలపై నివేదిక తీసుకుంటామని ఆమె తెలిపారు. చేపల మృత్యువాతతో మత్స్యకారులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి చేరుకొని చెరువులో చనిపోయిన చేపలను పరిశీలించి గంగపుత్రులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు విడియోకాల్ చేసిన ఆయన చేపలను చూపించి కాలుష్యం పరిస్థితిని వివరించారు. కలుషిత జలాల కారణంగా మత్స్యకారులకు లక్షల రుపాయల నష్టం వాటిల్లిందని, పంటలకు నష్టం జరిగి రైతులు పంట దిగుబడి సరిగా లేక పెద్దఎత్తున నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈపిటి ఏర్పాటు చేసి కాలుష్య జలాలను శుద్ధి చేయాలని, కాలుష్య కారక పరిశ్రమలను తరలించాలని సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మత్స్య శాఖ జిల్లా సొసైటీ డైరక్టర్ మెదబోయిన వెంకటేశ్, మాజీ సర్పంచ్ ఉదారి వేణుగోపాల్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాల ని కోరారు. వాగులో రాత్రి పూట కెమికల్స్‌ను కలుపుతున్న వారిని అధికారులు, పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



చెరువులో మృతిచెందిన చేపలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ అధికారులు, మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, మత్స్యకార నేతలు వెంకటేశ్, వేణుగోపాల్

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**-రంగారెడ్డి జిల్లా జెఎసి కన్వీనర్ డాక్టర్ రామారావు**

**రంగారెడ్డి అర్బన్,సెపెంబర్01,ప్రభాతవార్త:-**

రంగారెడ్డి జిల్లా ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ,కార్మిక మరియు పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలోసెప్టెంబర్ 1వ తేదీన జరిగిన పెన్షన్ విద్రోహదినాన్ని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్ నందు ఉదయం 10:30 గంటలకు నల్ల బ్యాడ్జెస్ తో ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అర్‌టిసి కళ్యాణ మండపం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన సమావేశానికి జిల్లా నుండి పెద్ద ఎత్తున హాజరు అయ్యారని రంగారెడ్డి జిల్లా జేఏసీ కన్వీనర్ డాక్టర్ రామారావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనేష్ కుమార్ నోరి, శిది వెంకటేష్, గోపాల్ నాయక్, ఇస్మాయిల్, కుశాల్ జమ, నాగార్జున రావు, వెంకటప్ప, రాకేష్, రంగయ్య, శాంతి శ్రీ, మహేష్, సైదమ్మ, అలివేలు, ఫైలట్,చంద్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనంలో గొడవపడ్డ వారిపై కేసు నమోదు

**వికారాబాద్, సెప్టెంబర్01, ప్రభాతవార్త ః**

వినాయక నిమజ్జన ఉత్సవాల్లో భాగంగా గొడవ పడ్డ కొందరు యువకులపై కేసు నమోదు చేసినట్లు వికారాబాద్ సీఐ భీమకుమార్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి కమలనగర్ లో వినాయక నిమర్జనం సందర్భంగా కొందరు వ్యక్తులు గొడవకు దిగి, అక్కడి ప్రజల శాంతి కి భంగం కలిగించారు, అట్టి వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వినాయక నిమర్జన నిర్వాహకులు వినాయక నిమర్జనం శాంతి యుతంగా, అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా జరుపుకోవాలని సూచించారు. ప్రజా శాంతికి భంగం కలిగించిన విద్వేషాలు రెచ్చగొట్టినా, నిభందనలు ఉల్లంగించినా పోలీస్ వారు అట్టి వారిపై చట్ట పంమైన చర్య తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.నిమర్జనంలో డీజే లకు అనుమతి లేదని, డీజే వినియోగిస్తే డీజే యజమానిపై వినియోగించిన నిమర్జనం నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## కొడంగల్ తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన దీపక్ శ్యామ్సన్

**కొడంగల్ రూరల్, సెప్టెంబరు 1 (ప్రభాతవార్తః** కొడంగల్ నూతన తహసీల్దార్ గా దీపక్ శ్యామ్సన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన విజయ్‌కుమార్ పూడూర్ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పూడూర్ తహసీల్దార్‌గా, కలెక్టరేట్‌లో వివిధ విభాగాల్లో సూపరిండెంట్‌గా పని చేసిన దీపక్ శ్యామ్సన్ కొడంగల్ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ దీపక్ శ్యామ్సన్‌ను మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, సేవాలాల్ మండల కమిటీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, హీరాసింగ్, భీమ్లానాయక్ తదితరులు సోమవారం కార్యాలయంలో శాలువాతో సన్మానించారు.

## సిపిఎస్ వద్దు... ఒపిఎస్ ముద్దు



**దౌల్తాబాద్,సెప్టెంబర్ 01,ప్రభాతవార్త:**

సీపీఎస్ వద్దు-ఓపీఎస్ ముద్దు అనే నినాదంతో సీపీఎస్‌కు వ్యతిరేకంగా తెలంగాణ గిరిజన ఉఫాధ్యాయ సంఘం దౌల్తాబాద్ మండల శాఖ అధ్యక్షులు కాట్రావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ..పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని ఇది బిక్ష కాదని సీపీఎస్ అనేది ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని అన్నారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ మండల విధ్యాధికారి వెంకట స్వామి,దౌల్తాబాద్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వసంత,దౌల్తాబాద్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, చెల్లాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు హనుమంతు,సీనియర్ ఉపాధ్యాయులు ఉషన్న,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దేవేందర్

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఘట్‌కేసర్ మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం సికింద్రాబాద్‌లోని పద్మని ఎలెక్ట్ హోటల్లో జరిగిన అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రోటం భూపతి చేతుల మీదుగా దేవేందర్ నియామకపత్రం అందుకున్నారు. ఈసందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ అన్ని ముదిరాజ్ సంఘాల ఐక్యతతో ముందుకు సాగితేనే జాతి హక్కులు సాధించుకోవడం సాధ్యపడుతుందని, మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామన్నారు. ముదిరాజ్‌లు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి ఎంపీపీలుగా, జడ్పీటీసీలుగా, సర్పంచులుగా ఎన్నికై రాణించాలని, జాతి బిడ్డలు ఎదగాలంటే రాజకీయ జేఏసీగా ఏర్పడాల్సిన అవసరముందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, కార్యదర్శి విబి.వెంకటనారాయణ, కోశాధికారి అశోక్ రామదాస్, జాతీయ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.



భూపతి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న దేవేందర్

## ఉన్నత శిఖరాలకు చేరాలంటే విద్యార్థి దశ కీలకం

**ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మోటివేషన్ స్పీకర్ సుదర్శన్**



**కేశంపేట సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరాలంటే చిన్నప్పటి నుంచే తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోని, దిశా నిర్దేశం చేసుకోవాలి, విద్యతో పాటు క్రమశిక్షణను అవలంబించుకోవాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ మోటివేషన్ స్పీకర్ కల్లేపల్లి సుదర్శన్ అన్నారు. సోమవారం కేశంపేట మండల పరిధిలోని నిర్దావెల్లి గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భవిష్యత్తులో తీసుకోవాల్సిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు, విద్యార్థులు సమాజంలో భాగస్వాములవ్వడం ఇతరులకు సహాయం చేయడం వంటివి చిన్నప్పటినుండే అలవర్చుకోవాలని భావితరాలకు మార్గదర్శకాలు కావాలని, క్రమశిక్షణతో ఉండి ఉన్నత శిఖరాలకు చేరుకొని ప్రతి విద్యార్థి ఒక డాక్టర్ లాయర్ ఇంజనీర్ అయ్యి ఉన్న ఊరికి కన్న తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన విద్యార్థులకు సూచించినట్లు తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు సుదర్శన్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడ్డగోలు నిర్మాణాలు.. అడిగేవారే కరవు...!



**మంచాల,సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:**

మంచాల మండలం నోముల గ్రామ పరిధిలో అక్రమ అంతస్తుల నిర్మాణాలు ఎక్కువయ్యాయి.గురు నానాక్ యూనివర్సిటీ ముందు నోముల గ్రామపంచాయతీ పరిధిలో విచ్చలవిడిగా నూతన భవనాలు నిర్మిస్తున్నారు. పరిమితికి మించి అంతస్తులు నిర్మిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. గ్రామపం చాయతీ సెక్రటరీ వివరణ కోరగా ఒక భవనానికి నోటీసులు ఇచ్చాం అని తెలిపారు. ఇక్కడ నిర్మిస్తున్న భవనాలన్నీ హాస్టల్ కోసమే అని అందరికీ తెలిసిన విషయమే కానీ నివాస అనుమతులతో కమర్షియల్ బిల్డింగులు నిర్మిస్తున్నారు. జి ప్లస్ టూ పర్మిషన్ ఉండగా పెంట్ హౌస్ పేరిట మరో ఫ్లోర్ వేస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనాలకు కమర్షియల్ పన్నులు వేసి గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచాలని స్థానిక ప్రజలు అధికారులకు డిమాండ్ చేస్తున్నారు.

## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్**



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్01, ప్రభాతవార్త ః**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 86 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు వారి సమస్యలు కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్, సుధీర్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగ్లీ లాల్, ఆర్‌డిఓ వాసు చంద్ర లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో నిర్మాణ పనులు ఆపాలి



తాహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మండల జర్నలిస్టులు

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండలంలోని జర్నలిస్టులకు కేటాయించినటువంటి స్థలంలో చేపడుతున్న పనులను వెంటనే ఆపాలని మండలంలోని జర్నలిస్టులు తహసీల్దార్ గాయత్రికి సోమవారంరోజు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మండల జర్నలిస్టులు మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో మండలంలోని జర్నలిస్టులకు చంద్రకల్ గ్రామంలోని సర్వే నంబర్ 29లో ఒక ఎకరం ప్రభుత్వ భూమిని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం 2023లో స్థానిక తాహసీల్దార్ కేటాయించారు.లేఅవుట్ చేసి 15 మంది జర్నలిస్టులకు పట్టాలు పంపిణీ చేశారు.జర్నలిస్టులకు పట్టాలు పంపిణీ చేసిన స్థలంలో పల్లె దవఖాన నిర్మాణ పనులు చేపట్టడం సరైనది కాదని అన్నారు.వెంటనే అధికారులు ఈ పనులు ఆపాలని ఈ సంధర్బంగా వారు డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్ గాయత్రికి వినతిపత్రం అందజేశారు.అందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే చంద్రకల్ గ్రామానికి వెళ్లి స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా తాహసీల్దార్ గాయత్రి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలలో పల్లె దవాఖాన నిర్మాణం పనులను నిలిపివేసి పక్కనే ఖాళీ స్థలంలో పల్లె దవఖాన నిర్మాణానికి చర్య తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల గిద్దావరి సునీల్,జర్నలిస్టులు మల్కయ్య గౌడ్,మధుసూదన్ గౌడ్,గోపాల్ గౌడ్,శివశంకర్,హన్మంతు,అక్రమ్ పాషా,మహిపాల్ రెడ్డి, అయూబ్,శ్రీనివాస్,రాజప్ప,రాకేష్,షఫీ,వీరేష్ పాల్గొన్నారు.

## నేడు జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

**ఘట్‌కేసర్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:** ఈనెల 2వ తేదీన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఘట్‌కేసర్ జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ కం 'ఎంపికలు' నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి పిడి కె.శ్రీరాములు తెలిపారు. అండర్-14, అండర్ -17 విభాగాలలో బాల, బాలికలకు మంగళవారం వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. అండర్-14 విభాగంలో 2012 జనవరి 1 తరువాత జన్మించి ఉండాలని అండర్-17 విభాగంలో 2009 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు స్కూల్ బోనాఫైడ్ పెన్‌నెంబర్, ఆధార్ జిరాక్స్‌తో మంగళవారం ఉదయం 9 గంటలకు ఎదులాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిపోర్ట్ చేయాలని అదనపు సమాచారం కోసం పిడి కె.లక్ష్మి సెల్ 8008420050 కు సంప్రదించాలని జోనల్ సెక్రటరీ శ్రీరాములు సూచించారు.

